క్లుప్తంగా

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు

మార్కాపురం టౌన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ప్రెసిడెంట్ కేవీ రమణారెడ్డి, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ మార్కాపురం తాలూకా కార్యదర్శి వడ్లమాని శ్రీనివాస్, రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖరరావు, ప్రకాశం సర్కిల్ ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం జాయింట్ సెక్రటరీ టి.రామారావు, పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రమేష్‌రెడ్డి తదితరులు మంగళవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమం కోసం సీఎం విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. కొత్త జిల్లాల్లో ఉద్యోగులకు 12 నుంచి 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంపుదల, పీఆర్‌సీ అమలుకు నూతన కమిటీ ఏర్పాటు, సీపీఎస్ రద్దుతో ఉద్యోగులకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో వివిధ శాఖల ఉద్యోగులతో కలిసి సీఎంకు కృతజ్ఞత సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పెద్దారవీడు: మండలంలోని పుచ్చకాయలపల్లి సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాసర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీ, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు హాజరు కావాలని కోరారు.

చిరుధాన్యాల పంపిణీ

రాచర్ల: అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం 2023 భాగంగా జాతీయ ఆహార భద్రత మిషన్ పథకంలో కొర్ర విత్తనాలను మండలంలోని ఆకవీడులో గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొర్ర విత్తనాల విత్తనం రకం ఎస్ఐఏ-3156 (మహానంది) ఈ రకం మొక్క కాల పరిమితి 80 నుంచి 85 రోజులు ఉంటాయి. కంకులు పొడవుగా ఉండి గింజలు మధ్యస్థంగా ఉంటాయన్నారు. గింజలు గోధుమ వర్ణంలో ఆకర్షణీయంగా ఉంటాయని, ఈ రకం అగ్గి తెగులు మరియు వెర్రికంకి తెగులును కొంతవరకు తట్టుకుంటుందని తెలిపారు. యాంత్రీకరణకు అనువైందని, ఈ రకం గింజల్లో పోషకాలు అధికంగా ఉంటాయని వివరించారు. వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, ఆకవీడు రైతు భరోసా కేంద్రం -1 అగ్రికల్చర్ అసిస్టెంట్ వరలక్ష్మి పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

కంభం: మండలంలోని తురిమెళ్ల ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన షేక్ రెహానను వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించి నగదు బహుమతి అందజేశారు. క్లబ్ చైర్మన్ మాగులూరి శ్రీకాంత్, తురిమెళ్ల సర్పంచి సుభద్ర, ఎంపీటీసీ ఖాసింబీ, ఉపాధ్యాయుడు నరసింహారావు, గణేష్ పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్‌కు వెన్నా పరామర్శ



గుంటకను పరామర్శిస్తున్న హనుమారెడ్డి

మార్కాపురం టౌన్: స్థానిక మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత గుంటక సుబ్బారెడ్డిని మంగళవారం ఆయన నివాసంలో ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై నెలరోజులపాటు హైదరాబాద్‌లో చికిత్స తీసుకుని మార్కాపురం వచ్చిన సుబ్బారెడ్డిని వెన్నా పరామర్శించి ఆరోగ్యం గురించి తెలుసుకున్నారు. ఆయన వెంట పార్టీ నాయకుడు గాయం రామకృష్ణారెడ్డి ఉన్నారు.

జగనన్న విద్యాకానుకతో పేద విద్యార్థులకు భరోసా

కంభం: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలని ఎంపీపీ చేగిరెడ్డి తులశమ్మ, కందులాపురం సర్పంచ్ బత్తుల తిరుపాలమ్మ(రజని) అన్నారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంఎస్‌ఎస్)లో మంగళవారం జరిగిన జగనన్న విద్యాకానులకల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు, నోటుపుస్తకాలు, ఇతర వస్తువులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ప్రజలకు మేలైన వైద్యం అందించాలి

- పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ప్రజలకు మేలైన వైద్యం అందించి ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. చందలూరు పీహెచ్‌సీని ఆయన మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇక్కడ కాన్పులు జరిగేవి కాదని, ప్రస్తుతం కాన్పులు కూడా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. రాత్రి పూట స్టాఫ్ ఉండటం లేదని, ఊరి చివర కావడంతో ఆగంతకులు ఎక్కువగా తిరుగుతున్నారని, మహిళా స్టాఫ్ భయపడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యేతో చెప్పారు. పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్ఐను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆస్పత్రి పరిశుభ్రంగా ఉందని, స్టాఫ్ చక్కగా పని చేస్తున్నారని నర్సులను ఆయన అభినందించారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి విడదల రజనిలు ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించారని చెప్పారు. వైద్యుల కొరత లేకుండా ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తున్నారని చెప్పారు. వైద్యులు కిరణ్మయి, స్పందన, శ్రీనివాసరావు, సురేఖారెడ్డి పాల్గొన్నారు,

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



మాట్లాడుతున్న ఎంఈఓ అమీర్



ప్రతిభ చాటిన విద్యార్థులతో అధ్యాపకులు

పొదిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీయెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ తారావాణి జగనన్న ఆణిముత్యాలు ప్రోత్సాహక బహుమతులు మంగళవారం అందజేశారు. సీహెచ్.గాయత్రి(బైపీసీ), జి.విష్ణుప్రియ(సీఈసీ), ఎం.గురు ప్రసాద్(హెచ్ఈసీ)కు అభినందించి నగదు, ప్రశంస పత్రాలు అందించారు. ఉన్నత చదువుల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ను అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది సన్మానించారు.

దొనకొండ: ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేసిందని, విద్యార్థుల విద్యాభివృద్ధి భవిష్యత్తుకు ఎంతో ఉపయోగ పడుతుందని సర్పంచ్ యామిని బాలిరెడ్డి తెలిపారు. మండలంలోని తెల్లబాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న ఆణిముత్యాలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఎంఈఓ-2 అమీర్ అధ్యక్షతన సభ జరిగింది. తెల్లబాడు జెడ్పీలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన గ్రోసుల నారాయణమ్మ, సజ్జలదిన్నె రామాంజనేయులు, బాదం సునీతకు ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మెడల్స్, సర్టిఫికెట్లు, నగదు అందజేశారు.

కొమరోలు: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నట్లు తాటిచెర్ల సర్పంచ్ బొమ్మిని రంగమ్మ తెలిపారు. మండలంలోని తాటిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022-23 విద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు అవార్డులు మంగళవారం అందచేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ బాదం వేణుగోపాల్, సర్పంచ్ బొమ్మిని రంగమ్మ, వెంకటేశ్వర్లు అవార్డులు అందచేశారు. ప్రధానోపాధ్యాయుడు శేషకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12 మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్



విద్యార్థులకు నగదు అందిస్తున్న డాక్టర్ కృష్ణారెడ్డి

మార్కాపురం: పట్టణంలోని అమలక లక్ష్మీనారాయణస్వామి(వెంకచ్చమ్మ గుడి) దేవస్థానం ఆధ్వర్యంలో 12 మంది పేద విద్యార్థులకు వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి రూ.1500 చొప్పున మంగళవారం స్కాలర్‌షిప్ అందించారు. కమిటీ తరఫున సేవా కార్యక్రమంలో భాగంగా స్కాలర్‌షిప్ అందించామని ఆలయ అధ్యక్షుడు డాక్టర్ డీవీ కృష్ణారెడ్డి, మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాలెం చెంచయ్య, ఏరువ వెంకటరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, మల్లారెడ్డి, ధనలక్ష్మి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే అన్నా



మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని విజయవాడలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యే అన్నా రాంబాబు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నా రాంబాబు గిద్దలూరు మార్కెట్ యార్డు ఆవరణలో పసుపు కొనుగోలు కేంద్రంలో పసుపు కొనుగోలు సేకరణ కాల పరిమితి పెంచాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలోని పసుపు రైతుల ఉపయోగార్థం కొనుగోలు సేకరణ పరిమితి పెంచేందుకు ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలోని రైతుల సమస్యలను మంత్రితో ఆయన చర్చించారు.

ఓటర్ల జాబితాను నవీకరణ చేయాలి



మాట్లాడుతున్న ఈఆర్ఓ లోకేష్

తాళ్లూరు: ఓటర్ల జాబితాను నవీకరణ చేయాలని దర్శి నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి (ఈఆర్ఓ), స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవీఎస్ లోకేష్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సూపర్‌వైజర్లు, బీఎల్ఓలతో ఆయన సమావేశమయ్యారు. లోకేష్ మాట్లాడుతూ కొత్త ఓటర్ల చేర్పులు, ఆధార్ అనుసంధానం, తొలగింపు, పేర్లు తప్పులకు సంబంధించి విచారణ చేపట్టి ఓటర్ల జాబితా నవీకరణకు సహకరించాలని కోరారు. తహసీల్దార్ కేవీ ప్రసాద్, డీటీ ఇస్మానియేల్‌రాజు, ఎస్ఏ మూర్తి, జేఏ సుధీర్ పాల్గొన్నారు.

స్థల వివాదంలో ముగ్గురికి గాయాలు

యర్రగొండపాలెం: స్థలం విషయంపై అన్నదమ్ముల మధ్య వచ్చిన వివాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చెన్నరాయునిపల్లెలో మంగళవారం జరిగింది. అన్నదమ్ములు వెన్నా చిన్నవెంకటరెడ్డి, వెన్నా నారాయణరెడ్డి తమకు చెందిన స్థలం, పొలాల పంపకాల్లో మనస్పర్థలు వచ్చాయి. వీరు కొంతకాలంగా ఘర్షణ పడుతున్నారు. ఈ నేపథ్యంలో కర్రలు, గొడ్డళ్లతో దాడికి దిగారు. చిన్న వెంకటరెడ్డి భార్య లక్ష్మీదేవికి గొడ్డలి గాయమైంది. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం పలనాడు జిల్లా నరసరావుపేటకు తరలించారు. నారాయణరెడ్డి, ఆయన భార్య సుబ్బులు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఎస్ఐ జి.కోటయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులోని హిందూ శ్మశానవాటికలో ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు కొళ్ళెట్టి జగన్‌బాబు ఆధ్వర్యంలో అభివృద్ధి పనులను మంగళవారం ప్రారంభించారు. ఇందులో భాగంగా శ్మశానవాటికలో చిల్లచెట్లను తొలగించి మట్టిపోసి చదునుచేశారు. త్వరలోనే డీప్‌బోరు వేసి, ప్రహరీ నిర్మించనున్నట్లు జగన్‌బాబు తెలిపారు.

హైవేపై ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

త్రిపురాంతకం: నేషనల్ హైవేపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని దూపాడు వద్ద ఆగిన లారీని ఆటో ఢీకొట్టడంతో వేముల శ్రీను, దూదేకుల బాజీలు గాయపడ్డారు. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో మార్కాపురం వైద్యశాలకు తరలించారు.

విద్యలో సాధికారత కోసమే సింగిల్ మేజర్ డిగ్రీ విధానం

మార్కాపురం: విద్యలో సాధికారత కోసమే నూతన విద్యా విధానంలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రవేశపెట్టిందని సాధన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మధుసూధన్ పేర్కొన్నారు. సామవారం కళాశాలలో ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం సూచనల మేరకు విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ హానర్స్ కోర్సులు, మల్టీ డిసిప్లినరీ సబ్జెక్టులు, స్కిల్స్ సబ్జెక్టులు, ఇంటర్న్‌షిప్, ప్రాజెక్టు వర్క్స్ తదితర అంశాలను పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. మధ్యలో చదువు ముగించేవారికి సర్టిఫికెట్లు, డిప్లమో, డిగ్రీ పట్టాలు పొందే అవకాశం, ఆనర్స్‌తో నేరుగా పరిశోధనా రంగంలోకి వెళ్లే అవకాశాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయం చేయాలంటూ ధర్నా



ఆందోళనకారులకు సర్ది చెబుతున్న సీఐ

దర్శి: రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందిన కోటేషు కుటుంబానికి న్యాయం చేయాలంటూ గడియారం స్తంభం సెంటర్‌లో మృతుడి కుటుంబ సభ్యులు మంగళవారం ధర్నా చేశారు. రోజు గడిచినా తమను పట్టించుకోలేదని బాధితులు వాపోయారు. పోస్టుమార్టానికి సంతకం పెట్టాలని అడుగుతున్నారే తప్ప తమకు కేసు విషయాలు చెప్పడం లేదన్నారు. అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. కోటేషు కుటుంబానికి న్యాయం చేయాలని, డ్రైవర్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ధర్నా చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు వచ్చి ధర్నా విరమించుకోవాలని కోరారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. సీఐ రామకోటయ్య, ఎస్ఐ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది ఆందోళనకారులకు సర్ది చెప్పి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ విషయంపై ఎస్ఐ రామకృష్ణను వివరణ కోరగా బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే కేసు నమోదు చేశామని చెప్పారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, డ్రైవర్ కోసం వెతుకుతున్నామని స్పష్టం చేశారు.

ఏకలవ్య విద్యార్థినికి కాంస్య పతకం



అమృత వర్షిణి (ఫైల్)

పెద్దదోర్నాల: మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్‌లో జరిగిన నేషనల్ యోగా ఒలింపియాడ్ 2023లో మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన కె.అమృత వర్షిణి బాలికల సెకంటరీ స్థాయిలో కాంస్య పతకం సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్యేల్ జోబ్ హర్షం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ తరఫున ప్రాతినిత్యం వహించిన అమృత వర్షిణికి అధ్యాపకులు అభినందనలతో ముంచెత్తారు.

విత్తన దుకాణాల తనిఖీ

దర్శి: మండల పరిధిలోని విత్తన దుకాణాలను ఏడీఏ కె. బాలాజీ నాయక్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. పలు షాపులను పరిశీలించి కొనుగోలు, అమ్మకం ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. బాలాజీ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన సందర్భంగా విత్తన దుకాణాలు తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు న్యాణ్యత,రకాలు, ధరలు తనిఖీ చేశామన్నారు. విత్తనాలు తీసుకున్న రైతులు కచ్చితంగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

డ్వాక్రా గ్రూపులు ఆర్థికంగా బలోపేతం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ బాబూరావు

గిద్దలూరు రూరల్: రుణాలు పొందిన డ్వాక్రా మహిళా గ్రూపు సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని డీఆర్‌డీఏ పీడీ బాబూరావు అన్నారు. స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయంలో గిద్దలూరు, కొమరోలు, రాచర్ల క్లస్టర్ పరిధిలోని పొదుపు గ్రూపు సభ్యులకు మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రూపుల గ్రేడింగ్ అన్ని గ్రూపులు ఏ గ్రేడులో ఉండాలన్నారు. స్త్రీ నిధి, సీఐఎఫ్ ఉన్నతి రుణాలు తీసుకున్న గ్రూపుల నుంచి 100 శాతం రికవరీ ఉండాలన్నారు. రుణాలు పొందిన మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకుని కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకోవాలని సూచించారు. జిల్లా సమాఖ్య ప్రెసిడెంట్ నిర్మల, స్త్రీ నిధి ఏజీఎం హర్షవర్ధన్, డీపీఎం ఐబీ కృష్ణారావు, ఏపీఎంలు నరేష్, ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలు పంపిణీ

గిద్దలూరు రూరల్: మండలంలోని కొత్తపల్లె రైతుభరోసా కేంద్రం వద్ద మంగళవారం చిరుధాన్యాలు కొర్రల ప్యాకెట్లను స్థానిక వ్యవసాయ సంచాలకులు డాక్టర్ బాలాజీ నాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. మండలంలో సుమారు 300 ఎకరాల్లో చిరుధాన్యాల సాగు చేయించాలనే లక్ష్యంతో ఉన్నామన్నారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎలక్షన్ డీటీగా దేవప్రసాద్

దర్శి: దర్శి మండలం ఎలక్షన్ డీటీగా టి.దేవప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు డీటీని దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. దేవప్రసాద్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రణాళికా బద్ధంగా పని చేస్తామని, అందరి సహకారంతోనే అది సాధ్యమవుతుందన్నారు. వీఆర్వోలు మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే చర్యలు

కంభం: పిల్లలను పనుల్లో ఉంచుకుంటే చర్యలు తప్పవని మార్కపురం కార్మిక శాఖ అధికారి గోపాల్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా ప్రత్యేక బృందంగా ఏర్పడి దుకాణాలు, హోటల్స్, ఇతర వ్యాపార సంస్థల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకోవాల్సిన వయసులో వారిని బడికి పంపకుండా పనులకు పంపించి వారి భవిష్యత్తును నాశనం చేయకూడదన్నారు. బాలకార్మికులను పనుల్లో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జగనన్న సురక్ష పథకంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 23వ తేదీన జగనన్న సురక్ష పథకం ప్రారంభించనున్న సందర్భంగా స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట బ్బయ్య అధ్యక్షతన అవగాహన సమావేశం నిర్వహించారు. కమిషనర్ వై.రామకృయ్య మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకంతో ప్రజలకు చేకూర్చే ప్రయోజనాలు వాటి అంశాలను వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారి వద్దకు అధికారయంత్రాంగం వెళ్లి సమస్యలను తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టబోయే కార్యక్రమంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఆర్‌డీ రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వలి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించడమే 'జగనన్న సురక్ష' ఉద్దేశం

పొదిలి రూరల్: ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయడం, అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొదిలి మండలంలోని తలమళ్ల సచివాలయంలో తలమళ్ల, ఏలూరు, ఆముదాలపల్లి, ఉప్పలపాడు సచివాలయాల పరిధిలోని సర్పంచ్‌లు, సచివాలయల సిబ్బంది, వలంటీర్లు, సచివాలయాల కన్వీనర్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో సర్వే నిర్వహించిన అనంతరం జూలై 1 నుంచి నిర్వహించే మండల స్థాయి క్యాంపుల్లో సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఎంపీడీఓ పి.శ్రీకృష్ణ, వ్యవసాయ సలహా మండలి సభ్యుడు కె.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీనివాసరెడ్డి శ్రీనివాసరెడ్డి సుధాకర్

పొదిలి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ కొనకనమిట్ల మండల శాఖ నూతన కార్యవర్గాన్ని స్థానిక కార్యాలయంలో మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పప్పుల శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా చిలకల శ్రీనివాసరెడ్డి(దోస్త్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్థికశాఖ కార్యదర్శిగా చిలుకూరి సుధాకర్‌ను ఎన్నుకున్నారు. ఎన్నిక పరిశీలకుడు, వైఎస్సార్ టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వరికూటి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగానికి గత నాలుగేళ్లలో ప్రభుత్వం రూ.60 వేల కోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పొదిలి మండల అధ్యక్ష, కార్యదర్శులు పగడాల రాంగోపాలరెడ్డి, బాపతు యోగిరెడ్డి, జిల్లా కార్యదర్శి మడతల శివారెడ్డి, గౌరవాధ్యక్షుడు బండి పెద్దిరాజు, సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎంఈఓలు



రమాదేవిని సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు



నూతన ఎంఈఓ రమణారెడ్డి

పొదిలి: మండల రెండో విద్యాశాఖాధికారిగా పేరం నాగలక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు పి.రమణారెడ్డి, ఉపాధ్యాయులు బీవీ రెడ్డి, యోగిరెడ్డి తదితరులు సన్మానించారు.

కొనకనమిట్ల: మండల విద్యాశాఖాధికారి-2గా బరిగె నరసింహారావు నియమితులయ్యారు. ఎంఈఓ డాంగే షరీఫ్, నరసింహారావు యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్‌హై, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కృపారావు, గోనె శ్రీనివాసులు, పోలు శ్రీనివాసరెడ్డి, నాసర్‌మహ్మద్, కాసు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: యర్రగొండపాలెం ఎంఈవో-2గా మల్లు నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దరవీడు మండలం ఓబులక్కపల్లె ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఎంఈవో-2గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నాయక్‌కు అభినందనలు తెలిపారు.

దొనకొండ: ఎంఈఓ-2గా షేక్ అమీర్ నియమితులయ్యారు. తెల్లబాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్న ఆయన్ను ఎంఈఓ-2గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పాఠశాలల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.

బేస్తవారిపేట: మండల విద్యాశాఖాధికారిగా చేగిరెడ్డి రమణారెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అర్ధవీడు మండలం దొనకొండ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేస్తున్న రమణారెడ్డి బేస్తవారిపేటకు బదిలీ అయ్యారు. ఇక్కడ ఎంఈఓగా పని చేస్తున్న జింకా వెంకటేశ్వర్లు గిద్దలూరు ఎంఈఓగా బదిలీ అయ్యారు. నూతన ఎంఈఓ రమణారెడ్డి, బదిలీ అయిన ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లును యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

దర్శి: మండల విద్యాశాఖాదికారిగా నియమితులైన బి.రమాదేవిని యూటీఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. సత్కరించిన వారిలో జిల్లా కార్యదర్శి డి.వెంకటరెడ్డి, యూటీఎఫ్ నాయకులు మీనిగ శ్రీను, ఖాశీం, రామారావు, విజయ్‌కుమార్, శివపార్వతి, గీతాదేవి, రాజశేఖర్ , నాగేశ్వరరావు, కమ్మ శ్రీను, రామాంజనేయులు, రామారావు,రామిరెడ్డి పాల్గొన్నారు.

ఎంఈఈఓ-2గా అచ్యుత సుబ్బారావు

తర్లుపాడు: మండల ఎంఈఓ-2గా అచ్యుత సుబ్బారావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంఈఓ డి.సుజాతను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్షుడు నాసరయ్య, నారాయణరెడ్డి, జగన్, కాశయ్య, బాలరాజు, కాశిరెడ్డి, కృష్ణారెడ్డి, చలమయ్య, వెంకటేశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, తర్లుపాడు హెచ్‌ఎం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రసం పీల్చే పురుగును సకాలంలో అరికట్టాలి



ఆకవీడులో పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

రాచర్ల: పత్తి పంటలోని రసం పీల్చే పురుగులను రైతులు సకాలంలో గుర్తించి వాటి నివారణకు చర్యలు చేపట్టాలని గిద్దలూరు సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని ఆకవీడులో రైతులు సాగు చేసిన పత్తి పంట పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం పత్తి పంటలో రసం పిల్చే పురుగులు ఉధృత్తి ఎక్కువగా ఉందని, సరైన సమయంలో నివారణ చర్యలు చేపడితే తక్కువ ఖర్చుతో రసం పీల్చే పరుగుల ఉధృత్తిని తగ్గించవచ్చునని తెలిపారు. అంతేగాక పత్తి పంటలో పచ్చదోమ కూడా ఎక్కువగా ఉందని రైతులకు వివరించారు. పచ్చదోమ పిల్ల, పెద్ద పురుగులు ఆకు అడుగు భాగంలో చేరి ఆకుల నుంచి రసాన్ని పిలుస్తాయని, దీని వలన ఆకులు మొదట పసుపు రంగులోకి మారి తదుపరి ఆకు అంచులు ముదురు ఎరుపు రంగుకు మారి క్రమేపి ఆకులు మొత్తం ఎర్రబడి ఎండిపోయి రాలిపోతాయన్నారు. వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రఫీక్, రైతులు పాల్గొన్నారు.